క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన కొండూరు



నెల్లూరు(దర్గామిట్ట): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో రాష్ట్ర ఆఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జువ్వలదిన్నెలో ఫిషింగ్ హార్బర్‌ను నిర్మించడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (దర్గామిట్ట): వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ సమన్వయకర్త, రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డిని నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ప్రముఖ న్యాయవాది మల్లిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆయన సోదరుడు మల్లిరెడ్డి కోటారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి ఉన్నారు.

విశ్రాంత అధ్యాపకుడి మృతి



సంజీవరావు(ఫైల్)

నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర విభాగం హెడ్‌గా పనిచేసిన విశ్రాంత అధ్యాపకుడు సీ సంజీవరావు (96) సోమవారం మృతి చెందారు. ఆయన మద్రాసు ప్రెసిడెన్సీ నుంచి ఎమ్మెస్సీ మ్యాథ్స్ డిగ్రీ పొందారు. ఆయన 1957లో వీఆర్ కళాశాలలో అధ్యాపకులుగా చేరారు. 1987లో ఉద్యోగ విరమణ పొందారు. ఆయన పెద్ద కుమారుడు సీవీఎస్ భాస్కర్ కూడా వీఆర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు.

ఆదర్శ ఉద్యోగులకు నగదు బహుమతులు



నెల్లూరు సిటీ: నెల్లూరు-1 డిపోలో విధి నిర్వహణలో ఆదర్శంగా నిలిచిన డ్రైవర్లు, కండక్టర్లకు ఆ డిపో మేనేజర్ మురళీకృష్ణ మంగళవారం నగదు బహుమతులు అందజేశారు. కండక్టర్లు జేఎస్‌రెడ్డికి ప్రథమ, ఆర్ శ్రీనివాసులుకు ద్వితీయ, సురేంద్రకు తృతీయ నగదు బహుమతులు ప్రదానం చేశారు. అలాగే ఉత్తమ సేవలందించిన పలువురు ఉద్యోగులకు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజారవాణా శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు



నెల్లూరు(పొగతోట): జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగావకాశాలు కల్పించారు. ఇద్దరికి జూనియర్ సహాయకులుగా, ఇద్దరికి ఆఫీస్ సబార్డినేట్స్‌గా ఉద్యోగావకాశాలు కల్పించారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డిప్యూటీ సీఈఓ బీ చిరంజీవి మంగళవారం అందజేశారు.

వాటర్ కూలర్ల వితరణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రానికి మెప్మా పీడీ డీ రవీంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది రెండు వాటర్ కూలర్లను మంగళవారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించారు. మెప్మా ఉద్యోగి బీ కాంతయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ సిద్ధిఖ్, వందవాసి రంగ, వైద్యులు నాగమాణిక్యం, కే అనూష, మెప్మా సిబ్బంది డీ పెంచలయ్య, పీ హర్షిత, షేక్ జరీనా, సుభాషిణి, భవాని, కిరణ్, సాయిసింధు, కేంద్రం నిర్వాహకుడు దాసరి సుందరం, మేనేజర్ ఇంగిలాల మదన్‌మిత్రా, తదితరులు పాల్గొన్నారు.

రూరల్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

•ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని రూరల్ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. రూరల్ మండలం పెనుబర్తిలో మంగళవారం ఆయన పర్యటించారు. రూ.23 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే భవనం, రూ.20లక్షలతో నిర్మించిన శ్మశాన వాటిక ప్రహరీని ప్రారంభించారు. అనంతరం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాను సర్వేపల్లి ఎమ్మెల్యేగా పనిచేసినప్పటి నుంచి పెనుబర్తితో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. ఈ గ్రామంలో తాను చేసిన అభివృద్ధి కార్యక్రమాలు నేటికీ కనిపిస్తున్నాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు గ్రామంలో రూ.92 కోట్లతో సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. ఇంత పెద్ద మొత్తంలో లబ్ధి గతంలో ఏ ప్రభుత్వంలోనైనా చేకూరిందా అనేది ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. పెనుబర్తి ప్రశాంతతకు మారుపేరన్నారు. ఈ ప్రాంతంలో కక్షలు, వివాదాలు ఉండవన్నారు. రానున్న ఎన్నికల్లో పేదల పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నెల్లూరు రూరల్ నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్, నెల్లూరు విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు పార్లపల్లి రవీంద్రారెడ్డి, కలివెల



పెనుబర్తిలో ప్రచారం చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

పాశెం సొసైటీ అధ్యక్షుడు వీర రాఘవరెడ్డి, పెనుబర్తి సర్పంచ్ వెదనపర్తి సృజన, ఉపసర్పంచ్ వెదనపర్తి వెంకటేశ్వరరెడ్డి, నాయకులు పెరమన శ్రీనివాసులురెడ్డి, పార్లపల్లి మధుసూదన్‌రెడ్డి, పీ రమేష్, ఏ మురళి, డీ శ్రీనివాసులురెడ్డి, ఏ శ్రీనివాసులు, టీ శివకుమార్, టీ శ్రీను, వినోద్, ఎం శేఖర్‌రెడ్డి, ఎం మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, కోసూరు కేశవగౌడ్, కలివేల రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ముస్లిం మైనార్టీల మనోభావాలను దెబ్బతీస్తూ బీజేపీతో టీడీపీ పొత్తుపెట్టుకోవడం తీవ్ర మనోవేదనను కలిగించిందని, అందుకే ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు 28వ డివిజన్ టీడీపీ బూత్ కన్వీనర్ పలాన్ ఫయాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మినీబైపాస్‌లోని ఎంపీ ఆదాల కార్యాలయంలో ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో



పార్టీలో చేరిన పలాన్ ఫయాజ్‌తో ఎంపీ ఆదాల

చేరారు. రానున్న ఎన్నికల్లో రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు తన వంతు కృషి చేస్తానని ఫయాజ్ పేర్కొన్నారు. 29వ డివిజన్ కార్పొరేటర్ షేక్ సత్తార్, షేక్ రియాజ్, షేక్ సమీర్, పఠాన్ అస్లాం ఖాన్, షేక్ నవాబ్ జాన్, జాహిద్, అంజాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మసీదుల వద్ద ప్రత్యేక పారిశుధ్య పనులు

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ మేయర్ స్రవంతి, కమిషనర్ వికాస్‌మర్మత్ ఆదేశాల మేరకు రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని మసీదుల వద్ద నెల రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ హెల్త్‌ఆఫీసర్ వెంకటరమణ తెలిపారు. నగరంలోని చిన్నబజార్, శిఖరంవారివీధి, పడారుపల్లి ప్రాంతాల్లోని మసీదుల వద్ద పారిశుధ్య పనుల నిర్వహణను మంగళవారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని మసీదుల పరిసరాల్లోని చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లుతున్నట్లు తెలిపారు. పందులు, వీధి కుక్కల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్‌తో పాటు డ్రైనేజీల్లో



పారిశుధ్యాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న ఎంహెచ్‌ఓ వెంకటరమణ

ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నామని వివరించారు. ఆయన వెంట శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లు, సచివాలయాల శానిటరి సెక్రటరీలు ఉన్నారు.

వేడుకగా అలకలతోపు

నెల్లూరు(బృందావనం):మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి అలకలతోపు ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. వెండి నందిపై మూలస్థానేశ్వరుడు, పులి వాహనంపై భువనేశ్వరిదేవిని కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం చప్పరోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. చప్పరోత్సవానికి కూరపాటి రఘునాథరాజు ,జానకి దంపతులు, అలకలతోపు ఉత్సవానికి చెరుకుమూడి లక్ష్మీనరసయ్య తరుపున సీఎస్వీ సుబ్రహ్మణ్యం ఉభయకర్తలుగా వ్యవహరించారు.



వెండినంది, పులి వాహనాలపై కొలువుదీరిన ఆదిదంపతులు

అంతరాయాలు లేకుండా విద్యుత్‌ను అందించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వేసవిలో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుందని, అందుకు తగినట్లుగా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా వినియోగదారులకు అందించాలని విద్యుత్ శాఖ నెల్లూరుటౌన్-2 డీఈఈ మధుసూదన్‌రెడ్డి అన్నారు. నెల్లూరు టౌన్-2 విద్యుత్ సెక్షన్ల పరిధిలోని ఏఈలు, విద్యుత్ సిబ్బంది, మీటర్ రీడర్లతో ఎన్టీఆర్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్ రీడర్లు ఖచ్చితంగా స్కానింగ్ ద్వారా విద్యుత్ బిల్లులు తీయాలని సూచించారు. డీ లిస్టుపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బిల్లు వచ్చిన పదిహేను రోజుల్లోనే వినియోగదారుడు చెల్లిస్తే అదనపు చార్జీలు పడవన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులకు తెలియజేయాలన్నారు. డోర్‌లాక్‌లు ఎక్కువ రాకుండా చూడాలన్నారు. ఇళ్లలోని మీటర్లను బయట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు విద్యుత్ లోడ్ వాడుతున్న వారిని గుర్తించి అడిషనల్ లోడ్‌లో నమోదు చేయాలన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురికాకుండా ఎల్ఐ, ఎల్ఎంలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.




మాట్లాడుతున్న డీఈఈ మధుసూదన్‌రెడ్డి

లోడ్ ఎక్కువగా ఉన్న చోట అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటును గుర్తించి నివేదిక అందజేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ పీఎం సూర్యఘర్ పథకంపై వినియోగదారులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఒక కిలోవాట్ సోలార్ విద్యుత్ ఏర్పాటుకు రూ.70 వేలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం రూ.30 వేలు సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. రెండు కిలోవాట్ల సోలార్ ఏర్పాటుకు రూ.60వేలు సబ్సిడీ అందజేస్తుందని వివరించారు. బ్యాంకు రుణ సౌకర్యం కూడా ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఏఈలు విజయ్‌కుమార్, దామోదర్, సుకుమార్, ప్రసాద్, కృష్ణవేణి, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ శ్రీలత, సబ్ ఇంజినీర్ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

బీహార్ మాజీ సీఎం కర్పూరి ఠాగూర్‌కు నివాళి

నెల్లూరు(బృందావనం): బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం బీహార్ ముఖ్యమంత్రిగా కర్పూరి ఠాగూర్ ఎంతో పాటుపడ్డారని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. కర్పూరి ఠాగూర్‌కు భారతరత్న ప్రకటించిన సందర్భంగా పురమందిరంలో కర్పూరి ఠాగూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందన సభను మంగళవారం నిర్వహించారు. తొలుత కర్పూరి ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. విశ్రాంత డీఎస్పీ తోట ప్రభాకర్, తాడికొండ ప్రభాకర్‌రావు, నాయీబ్రాహ్మణ జేఏసీ ప్రెసిడెంట్



వినుకొండ సుబ్రహ్మణ్యం, విశ్రాంత డీఎంహెచ్‌ఓ మాశిలామణి, కుమ్మరి శాలివాహన సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిశేషయ్య, ఫౌండేషన్ నిర్వాహకుడు, సీనియర్ జర్నలిస్ట్ రామచంద్రమూర్తి, రంగారావు, దొర్నాల హరిబాబు, ఎం మాధవి, అన్నపూర్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే చర్యలు

నెల్లూరు(బారకాసు): పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం నిర్దేశించిన 130 మైక్రాన్ల కన్నా తక్కువ స్థాయి ప్లాస్టిక్ ఉత్పత్తులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంహెచ్‌ఓ వెంకటరమణ హెచ్చరించారు. నగరంలోని పెద్దబజార్, స్టోన్‌హౌస్‌పేట, తదితర ప్రాంతాల్లోని ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయ దుకాణాలపై మంగళవారం ఆయన ఆకస్మిక దాడులు నిర్వహించారు. 35 కిలోల నిషేధిత సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను సీజ్ చేశారు. దుకాణాల యజమానులకు రూ.20 వేలు జరిమానా విధించారు. మరోసారి విక్రయాలు జరిపితే దుకాణాలను



శిఖరంవారివీధిలోని ఓ దుకాణంలో నిషేధిత ప్లాసిక్ ఉత్పత్తులను సీజ్ చేస్తున్న ఎంహెచ్‌ఓ

శాశ్వతంగా సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన



నెల్లూరు(వేదాయపాళెం): పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా రంగనాయకులపేట ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని జ్ఞానమ్మతోట అంగన్‌వాడీ సెంటర్‌లో సెక్టార్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహారం, ప్రీస్కూల్ సంసిద్ధతపై మంగళవారం అవగాహన కల్పించారు. వివిధ రకాల చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారఉత్పత్తులను ప్రదర్శించారు. అంగన్‌వాడీలు నీరజ, రాధ, సుమిత్ర, హేమ, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. అలాగే బాలాజీనగర్ సెక్టార్ పరిధిలోని కొత్తమిట్టపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో నెల్లూరు అర్బన్ సీడీపీఓ అన్నపూర్ణ పాల్గొని పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగేశ్వరి, అంగన్‌వాడీలు ధనలక్ష్మి, మేరీ, తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరి అంధులకు చూపు

నెల్లూరు(అర్బన్): ఒక్కరి నేత్ర దానంతో ఇద్దరి అంధులకు కంటి చూపును ప్రసాదించవచ్చని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్రదాన కౌన్సిలర్ బాలాజీసింగ్ పేర్కొన్నారు. పొదలకూరురోడ్డు హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన మలిశెట్టి విశ్వనాథరావు(75) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యుల అంగీకారంతో బాలాజీసింగ్‌తో పాటు ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపి నేత్రదాన సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాలాజీసింగ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ముందుకొచ్చి నేత్రదానం చేయాలని కోరారు. నేత్రదాతలు 93471 11033, 99481 64781 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వచ్చే నెలలో ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

నెల్లూరు (టౌన్): ఏపీ మోడల్ స్కూల్స్‌లో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం వచ్చే నెల 21న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు డీఈఓ పీజేవీ రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 11 మోడల్ స్కూల్స్‌లో పరీక్ష ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్ష తెలుగు, ఇంగ్లిషు మీడియంలో ఉంటుందని తెలిపారు. ఈనెల 31వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలన్నారు. పరీక్ష రుసుం ఓసీ, బీసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీలకు రూ.75 అని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

నెల్లూరు(బృందావనం): నీలగిరి సంఘంలోని హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీస్ చర్చిలో ఎన్పీఎఫ్ ఆధ్వర్యంలో ఎనెల్ హాస్పిటల్ సౌజన్యంతో పాస్టర్ల కోసం మంగళవారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు మధుకిరణ్, జయరాజ్, హిమబిందు, సుధాకర్ తదితరులు పాస్టర్లకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కిరణ్‌క్లినిక్, రాఫా ఐ కేర్, ట్రినిటి హాస్పిటల్‌కు చెందిన వైద్య సిబ్బంది వైద్యసేవలు అందించారు. జిల్లా పాస్టర్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి డేవిడ్ దయాసాగర్, అధ్యక్షుడు ఎస్ శరత్, కోశాధికారి డాక్టర్ ఎస్ భాస్కరయ్య, గౌరవాధ్యక్షుడు రెవరెండ్ కే సాల్మన్, పాస్టర్ కోటేశ్వరరావు, రెవరెండ్ రాజశేఖర్‌దాసరి, పాస్టర్ హనోక్, ఆంథోని, సురేష్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

నెల్లూరు(దర్గామిట్ట): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు ఉదారంగా ఆర్థిక సాయం మంజూరు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు అండగా నిలుస్తున్నారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ.40.70 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి మంత్రి కాకాణి నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులకు వైద్యం చేయించుకున్న బాధితులు అప్పులపాలై ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి



చెక్కులను అందజేస్తున్న మంత్రి కాకాణి, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

ఆర్థిక సాయం అందజేస్తున్నారని తెలిపారు. పేదలకు ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయండి

నెల్లూరు(బారకాసు): ఓటరు నమోదుకు సంబంధించి ఫారం-6, 7, 8లపై అభ్యంతరాలుంటే తెలియజేయాలని నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ వికాస్‌మర్మత్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. మంగళవారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ ఓటర్ల జాబితా, ఎన్నికల సంబంధిత అంశాలపై చర్చించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు కొన్ని అంశాలను ప్రతిపాదించగా అందుకు ఆర్వో సానుకూలంగా స్పందించారు. కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూముతో పాటు ఓట్లు లెక్కింపు కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో వసతులు ఉండేలా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఓటరు దరఖాస్తులను పారదర్శకంగా విచారించి సవరణలు చేపడుతున్నామని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు వైఎస్సార్‌సీపీ నుంచి రాజీవ్‌రెడ్డి, టీడీపీ నుంచి హరికృష్ణ, సీపీఎం నుంచి కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, ఎన్నికల డీటీలు స్వర్ణ, చక్రపాణి పాల్గొన్నారు.



రాజకీయ పార్టీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు(బారకాసు): రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని నగర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, కమిషనర్ వికాస్‌మర్మత్ కోరారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఎస్వీఈఈపీ(స్వీప్) ప్రోగ్రాం-2024లో భాగంగా ఓటరు అవగాహన పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. 'ఓటు వేయడం మన హక్కు, యువత మేల్కొనండి, చైతన్య వంతమైన ప్రజాస్వామ్యం కోసం', తదితర పోస్టర్లను ప్రదర్శించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద, ఏఈఆర్వో వెంకటేశ్వర్లు, టీపీఆర్వో ప్రసాద్, ఎన్నికల విభాగ అధికారి చక్రపాణి పాల్గొన్నారు.

'ఎంఎంసీ యోజన'తో తాగునీటి సరఫరా పర్యవేక్షణ

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సరఫరాను నిరంతరం ఆన్‌లైన్ ద్వారా పర్యవేక్షించేందుకు 'ఎంఎంసీ యోజన' అనే మానిటరింగ్ టూల్‌ను నూతనంగా అందుబాటులోకి తీసుకొచ్చినట్లు నగర మేయర్ పొట్లూరి స్రవంతిజయవర్ధన్ తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో నూతన వాటర్ మానిటరింగ్ టూల్ ఎంఎంసీ యోజనను మంగళవారం మేయర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నూతన విధానంలో సచివాలయ అమెనిటీస్ కార్యదర్శి మంచినీటి కుళాయి కనెక్షన్ల వివరాలను ట్యాక్స్ అసెస్‌మెంట్లతో అనుసంధానించి పూర్తి వివరాలను నమోదు చేస్తారని తెలిపారు. సచివాలయం పరిధిలోని మంచినీటి ప్రధాన వాల్వులు, వాటికి నిర్దేశించిన సమయాలను పొందుపరుస్తారని వివరించారు. అనంతరం ప్రతిరోజూ క్రమం తప్పకుండా తమ పరిధిలోని అన్ని గృహాలకు సరఫరా అవుతున్న నీటి నాణ్యత, నీటి పరిమాణ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు.



'ఎంఎంసీ యోజన' టూల్‌ను ప్రారంభిస్తున్న మేయర్ స్రవంతిజయవర్ధన్

మచినీటి సరఫరాలో అంతరాయం, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సమాచారం చేరుతుందని, 24 గంటల్లో సమస్యను పరిష్కారించేందుకు చర్యలు తీసుకుంటారని వెల్లడించారు. అక్రమ కుళాయి కనెక్షన్లను గుర్తించి తొలగించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ రామకృష్ణ, ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, డీఈఈ సురేష్, ఏఈలు, సచివాలయ అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

వివేకాచూడమణిలో పరమాత్ముని స్వరూపం ఆవిష్కారం

నెల్లూరు(బృందావనం): పరమాత్మ స్వరూపాన్ని సంపూర్ణంగా విశదీకరించే గ్రంథం శంకర్ భగవత్పాదుల విరచిత 'వివేకాచూడమణి' అని ప్రముఖ ఉపన్యాసకులు డాక్టర్ కప్పర గిరిజాలక్ష్మి పేర్కొన్నారు. పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో చక్రాలవారి ట్రస్ట్ ఆధ్వర్యంలో వివేకా చూడామణిపై నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. చివరి రోజు గిరిజాలక్ష్మి ప్రవచించారు. శంకర భగవత్పాదుల క్రమ సన్యాసఘట్టాన్ని సంక్షిప్తంగా వివరించారు. చక్రాలవారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనంద్ కుమార్ అధ్యక్షోపన్యాసంలో మాట్లాడుతూ ఫాల్గుణ శుద్ధ విదియ నాడు శంకరభగవత్పాదులు నర్మదా నదీతీరాన గోవింద భగవత్పాదుల వారి నుంచి క్రమ సన్యాసదీక్షను స్వీకరించిన శుభదినం



డాక్టర్ కప్పర గిరిజాలక్ష్మికి సత్కారం

సందర్భంగా ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం ఉపన్యాసకురాలు గిరిజాలక్ష్మిని శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలు, నగదు పురస్కారాలతో సత్కరించారు. ట్రస్ట్ మేనేజర్ చక్రాల వేంకటలక్ష్మీనరసింహం, చక్రాల నాగరత్నకుమారి, సురభి మహాలక్ష్మి, ఛాయాకుమారి, జీ సుభద్రాదేవి, ఎం ఉదయ్‌కుమార్‌శర్మ, సీ చంద్రశేఖర్, జీ ప్రభాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ పర్యటన ఏర్పాట్ల పరిశీలన

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర గవర్నర్ అబ్దుల్‌నజీర్ పర్యటనకు సంబంధించిన ఎటువంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం హరినారాయణన్ ఆదేశించారు. నగరంలోని శ్రీవెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో గవర్నర్ పర్యటన ఏర్పాట్లను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డితో కలిసి కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. కళాక్షేత్రంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, కార్యక్రమం నిర్వహణపై అధికారులకు సూచనలు చేశారు. భద్రతాపరమైన ఏర్పాట్లపై పోలీసు అధికారులకు ఎస్పీ దిశా నిర్దేశం చేశారు. నగరంలో గవర్నర్ ప్రయాణించే మార్గాల్లో ట్రాఫిక్ క్లియరెన్స్, బందోబస్తు ఏర్పాట్లపై పోలీసు అధికారులకు ఎస్పీ పలు సూచనలు చేశారు. గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై మంగళవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జేసీ సేతు మాధవన్, ఏఎస్పీ సౌజన్య, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, సోషల్‌వెల్ఫేర్ డీడీ రమేష్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, అడిషనల్ కమిషనర్ శర్మద్ పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

నెల్లూరు(బారకాసు): నగరంలోని రామచంద్రాపురం, కపాటిపాళెం, వెంగమాంబవీధి-2, ఆకుతోట, చంద్రమౌళీనగర్, రైతుబజార్‌రోడ్డు, జనార్దన్‌రెడ్డికాలనీ, రామ్మూర్తినగర్, మల్లికార్జునపురం ప్రాంతాల్లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్యశిబిరాలను బుధవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ వికాస్‌మర్మత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆయా ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.